క్లుప్తంగా

ఇంటి వద్దే తడి, పొడి చెత్తను వేరు చేయాలి



వేమండ(గన్నవరం): ఉంగుటూరు మండలం వేమండ గ్రామంలో గురువారం ఉపాధి హామీ కూలీలకు తడి, పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ వి.దిలీప్‌కుమార్ మాట్లాడుతూ...ఇంటి వద్దే కూరగాయల వ్యర్థాలను తడి చెత్తగా, ప్లాస్టిక్ కవర్లు, వాటర్ బాటిళ్లు, అట్టపెట్టెలు, పాడైపోయిన ట్యూబ్‌లైట్స్ వంటి వ్యర్థాలను పొడి చెత్తగా వేరు చేయాలని చెప్పారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలని సూచించారు. అనంతరం గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అదే విధంగా ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్‌ను పరిశీలించి శుద్ధి చేసిన తేదీలను తనిఖీ చేశారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన


హనుమాన్‌జంక్షన్‌రూరల్: అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని హనుమాన్‌జంక్షన్ అగ్నిమాపక కేంద్రం అధికారి జీఆర్ మోహనరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని బాపులపాడు మండలం వీరవల్లిలోని వాణి విద్యానికేతన్‌లో గురువారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇంట్లో వంట గ్యాస్ సిలిండర్ల వల్ల అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలను వివరించారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన నియంత్రణ చర్యలను, మంటలను అదుపు చేసే పద్ధతులను ప్రత్యక్ష ప్రదర్శనల ద్వారా తెలిపారు.

దేవినేనికి ఘన నివాళి



పెనమలూరు: కానూరులో మాజీ మంత్రి దేవినేని రాజశేఖర్(నెహ్రూ) 8వ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, గ్రామ మాజీ సర్పంచి అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి(చిట్టిబాబు) పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ దేవినేని నెహ్రూ రాజకీయాలలో తనకంటూ ఒక ఇమేజ్ సృష్టించారన్నారు. పేద, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచి వారికి ఎనలేని సేవలు అందించారన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో నెహ్రూకు ప్రత్యేక స్థానం ఉందని చెప్పారు. కార్యక్రమంలో కంకిపాడు జెడ్పీటీసీ బాకీ బాబు, పార్టీ నాయకులు పిడికిటి రామకోటేశ్వరరావు, అన్నే శ్రావణ్‌కుమార్, వేమూరి బాలకృష్ణ, గుమ్మడి విజయ్‌కుమార్, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, లతీఫ్, చాంద్‌బాషా, మరీదు శ్రీనివాసరావు, భాస్కరరావు, సుబ్బరాజు, వరదీష్ పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి కృషి



గన్నవరం: గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. మండలంలోని మాదలవారిగూడెం, ముస్తాబాద, పురుషోత్తపట్నం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ...గ్రామాల్లో అధ్వానంగా ఉన్న రహదారులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే గన్నవరం-ఆగిరిపల్లి ఆర్అండ్‌బీ రోడ్డు పునర్నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గుడ్ ఫ్రైడే వేడుకలకు విరాళం



ఉయ్యూరు: గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని పురస్కరించుకుని ఉయ్యూరులోని ఆర్సీఎం ప్రార్థనా మందిరానికి రూ.10 వేలు విరాళాన్ని గురువారం అందజేశారు. వేడుకల సందర్భంగా అన్న సమారాధాన కార్యక్రమానికి ఈ విరాళాన్ని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి పార్టీ శ్రేణుల ద్వారా అందజేయించారు. పార్టీ ఉయ్యూరు పట్టణ అధ్యక్షుడు షేక్ అబుకలాం, మున్సిపల్ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు జంపాన కొండలరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ సోతే సురేష్‌బాబు, ప్రార్థనా మందిరం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే.. గల్లంతే !

- ప్రమాదకరంగా రక్షణ గోడలు
- శిథిలమై రూపురేఖలు లేని వైనం
- రాకపోకలకు ఆందోళన చెందుతున్న ప్రయాణికులు



కంకిపాడు లాకు సెక్షన్ వద్ద శిథిలమైన రక్షణ గోడ

కంకిపాడు: ప్రధాన కాలువలపై నిర్మించిన కల్వర్టులు శిథిలమయ్యాయి. రక్షణ గోడలు కూలిపోవటంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఆదమరిచి వాహనాలు నడిపితే పక్కనే ఉన్న కాలువల్లో పడిపోయినట్టే. రక్షణ గోడలు అభివృద్ధిలో జాప్యం జరుగుతుండటంతో భయంతో బిక్కుబిక్కుమంటూ ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు.

శిథిలావస్థకు చేరువలో..

ఇరిగేషన్ శాఖ కంకిపాడు సెక్షన్ పరిధిలో బందరు, పుల్లేరు కాలువలు ఉన్నాయి. వీటికి అనుబంధంగా వల్లూరు పడమట కాలువ, వంతెన కాలువ, నంబిగుంట, ఇతర పంట కాలువలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 35 వేల ఎకరాల పంట భూములు సాగులో ఉన్నాయి. ప్రధాన కాలువలపై నిర్మించిన రహదారుల మార్జిన్‌లలో రక్షణ గోడలు నిర్మించారు. కాల క్రమంలో భారీ వాహనాధాటికి రక్షణ గోడలు క్రమేపీ శిథిలమవుతున్నాయి. సెక్షన్ పరిధిలోని అనేక ప్రాంతాల్లో ఉన్న కల్వర్టు రక్షణ గోడల పరిస్థితి ఇదే విధంగా ఉంది. పూర్తిగా, సగం కూలిపోయి అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. ఎదురుగా వచ్చే భారీ వాహనాలను తప్పించే ప్రయత్నం రోడ్డు మార్జిన్‌కు వెళితే దెబ్బ తిన్న రక్షణ గోడల ప్రదేశంలో అమాంతం కాలువలోకి పడిపోయే ప్రమాదం లేకపోలేదు. దీంతో కాలువల సమీపంలోని రహదారుల మీదుగా రాకపోకలు సాగించే క్రమంలో భయం భయంగానే వాహనదారులు రాకపోకలు సాగించాల్సి వస్తోంది.

ఆధునికీకరణతోనే మోక్షం..

కంకిపాడు సెక్షన్‌ను పూర్తి స్థాయిలో ఆధునికీకరణ చేయాల్సి ఉంది. ఈ పనులతో సెక్షన్ పరిధిలోని అనేక పనులకు ముడిపడి ఉంది. ప్రత్యేకించి కాలువలపై ఉన్న రక్షణ గోడల అభివృద్ధికి మోక్షం లభించనుంది. ప్రస్తుత సీజన్‌లో ఈ పనులకు అనుమతులు, అవసరమైన నిధులు కేటాయిస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందని ప్రజలు కోరుతున్నారు.



వల్లూరు పడమట కాలువ వద్ద దుస్థితి



కంకిపాడు సెక్షన్ వద్ద పుల్లేరు కాలువపై ప్రమాదకరంగా రోడ్డు మార్జిన్

ప్రతిపాదనలు పంపాం..

కంకిపాడు సెక్షన్‌ను పూర్తి స్థాయిలో ఆధునికీకరించేందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపాం. కల్వర్టుల వద్ద రక్షణ గోడలు కూలిపోయి ఉన్న పరిస్థితి వాస్తవమే. నిధులు కోసం ఎదురుచూస్తున్నాము. కేటాయింపులు జరగ్గానే పనులు చేపట్టి, త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– నాగబాబు, ఏఈ, కంకిపాడు సెక్షన్

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

పెనమలూరు: గర్భిణులు పోషకాహారం తీసుకొని, బిడ్డ ఆరోగ్య వంతంగా జన్మించే విధంగా జాగ్రత్తలు పాటించాలని సీడీపీఓ కె.బేబీసుకన్య అన్నారు. పౌష్టికాహారం పక్షోత్సవాలలో భాగంగా గురువారం గోసాలలో గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ.. తల్లి గర్భిణి దశ నుంచి బిడ్డ పుట్టి రెండేళ్లు ఎదిగే వరకు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీలత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. కానూరులో సూపర్‌వైజర్ జి.విజయలక్ష్మి గర్భిణుల ఇళ్లకు వెళ్లి తీసుకోవాల్సిన ఆహారం, జాగ్రత్తలు తెలిపారు. యనమలకుదురు ఇందిరానగర్‌లో పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా సూపర్‌వైజర్ ఎం.కల్యాణి వర్మ తల్లులు, చిన్నారులను 100 రోజులు సంరక్షించటానికి అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కంకిపాడు: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఐసీడీఎస్ కంకిపాడు ప్రాజెక్టు సీడీపీఓ కె.బేబీసుకన్య అన్నారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన కంకిపాడులోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక సీమంతాలు నిర్వహించారు. గర్భిణీలకు సీమంతం చేసి చీర, సారె అందించారు. పోషకాహారంపై అవగాహన కల్పించారు. సీహెచ్‌సీ మాజీ చైర్మన్ యలమంచిలి కిషోర్‌బాబు, సూపర్‌వైజర్ ఎస్.అన్నామణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ఉంగుటూరు(గన్నవరం): ఉంగుటూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వడ్లమూడి సరోజిని మాట్లాడుతూ...తల్లీ బిడ్డల ఆరోగ్య సంరక్షణ కోసం మంచి పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ పి.వెంకటలక్ష్మి మాట్లాడుతూ...గర్భస్థ దశ నుంచి మొదటి వెయ్యి రోజులు సంరక్షణపై శ్రద్ధ వహించాలని చెప్పారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిరుధాన్యాలతో చేసిన వంటల ప్రదర్శన నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బి.పద్మాదేవి, ఎల్.దుర్గాదేవి, విమలకుమారి, ఈఓపీఆర్డీ దిలీప్‌కుమార్, ఎంఈఓ సాంబశివరావు, ఏపీఎం భూపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పాతపాడులో..

పాతపాడు(విజయవాడరూరల్): పౌష్టికాహారమే తల్లిబిడ్డలకు ఆరోగ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జె.కవిత అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా గురువారం పాతపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. పాతపాడు, మంగళాపురం, అప్పారావుపేట గ్రామాల్లోని 20 మంది గర్భిణులకు చీరె, గాజులు, పువ్వులు, పసుపు, కుంకుమ, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహిళా పోలీసు ఎం.సజినిరాణి, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



గోసాలలో సీమంతం చేస్తున్న సీడీపీఓ బేబీసుకన్య తదితరులు



ఉంగుటూరులో సీమంతంలో పాల్గొన్న ఎంపీపీ సరోజిని, సీడీపీఓ వెంకటలక్ష్మి



కంకిపాడులో సామూహిక సీమంతాలు చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు

ఉయ్యూరు: రాష్ట్రంలో వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందిస్తున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఉయ్యూరులోని టిడ్కో గృహ సముదాయ ఆవరణలో రూ.4.36 కోట్లతో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను గురువారం ప్రారంభించారు. మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ బిల్లులు పెంచాయన్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ప్రజలపై ఎలాంటి విద్యుత్ భారాలు మోపడం లేదన్నారు. కృష్ణా జిల్లాలో రూ.800 కోట్లతో విద్యుత్ కేంద్రాలను అందుబాటులోకి తెచ్చి సమస్యలను అధిగమించామన్నారు. పీఎం సూర్య ఘర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే బోడె ప్రసాద్, విద్యుత్ శాఖ ఎస్ఈ సత్యానందం, మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, ఈఈలు కృష్ణనాయక్, సుధాకర్, ఏఈ బసవశాస్త్రులు, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



ఉయ్యూరులో సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి తదితరులు

వన సంరక్షణ సమితి కమిటీ ఎన్నిక



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ పంచాయతీ పరిధిలోని బోడపాడులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వన సంరక్షణ సమితి నూతన కమిటీ ఎన్నిక ఫారెస్ట్ డీఆర్వో పోతురాజు అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో నర్సరీల పెంపకం, మొక్కలు, వనాలు, వణ్యప్రాణుల సంరక్షణ బాధ్యత వన సంరక్షణ కమిటీపై ఉంటుందన్నారు. అడవిలో ఉండే జంతువులు, ఇతర వణ్య ప్రాణుల వేట, అక్రమ రవాణా నివారించే చర్యలు చేపట్టాలన్నారు. అగ్ని ప్రమాదాల బారిన జంతువులు పడకుండా పర్యవేక్షణ జరపాలని సూచించారు. నూతన కమిటీలో 15 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఫారెస్ట్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

10 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

పెనమలూరు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయం బయటకు పొక్కకుండా అధికారులు అత్యంత గోప్యంగా ఉంచి నాటకానికి తెరలేపారు. వివరాల్లోకి వెళితే పెనమలూరులో మంగళవారం రాత్రి ప్రసాద్ అనే వ్యక్తి ఆటోలో అక్రమంగా 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం లోడ్ చేసి తరలిస్తుండగా స్థానికుల సమాచారంతో సివిల్ సప్లయిస్ అధికారులు పెనమలూరులో పట్టుకున్నారు. సమాచారం తెలుసుకున్న విలేకరులు బుధవారం వివరాలు అడిగితే రేషన్ బియ్యం కాదు తవుడు పట్టుకున్నామని అధికారులు మొఖం చాటేశారు. రేషన్ బియ్యం అక్రమంగా తరలివెళ్తుందన్న విషయం బయటకు వస్తే తమకు ఇబ్బందులు వస్తాయని సివిల్ సప్లయిస్, రెవెన్యూ అధికారులు ఈ వ్యవహారాన్ని రహస్యంగా ఉంచారు. బియ్యం తరలిస్తున్న వ్యక్తి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుపడినా సివిల్ సప్లయిస్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయలేదు, కేసు పెట్టలేదు. సంబంధిత మంత్రి మాత్రం అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తే పీడీ యాక్టు పెడతామని చెబుతున్నా అధికారులు మాత్రం అందుకు బిన్నంగా వ్యవహరిస్తూ అక్రమార్కులకు అండగా నిలిచారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై డీఎస్‌వో వి.పార్వతిని వివరణ అడగ్గా అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుకున్న ఘటన వాస్తవమేనని చెప్పారు. 10 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నామని, 6ఏ కింద జేసీ కోర్టులో కేసు పెట్టామమన్నారు.

నున్నలో తాగునీరు కలుషితం



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో తాగునీరు కలుషితమవుతుంది. ఇటీవల వైద్యసిబ్బంది సేకరించిన తాగునీటి శాంపిల్స్‌లో కలుషితమవుతున్నట్లు శాఖా పరమైన రిపోర్టులో వెల్లడైనట్లు ఎంఎల్‌హెచ్‌పీ సీహెచ్ రమ్య తెలియజేశారు. వైద్యశాఖ నివేదిక ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. దాన్ని చూసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ నున్న గ్రామాన్ని సందర్శించి కలుషిత నీటి సరఫరా తీరును పరిశీలించడానికి గురువారం రావాల్సి ఉంది. అనివార్య కారణాల వలన ఆయన పర్యటన రద్దు అయ్యింది. పోలవరం కాల్వ నుంచి వస్తున్న నీటిని చెరువులోకి నింపి మైక్రోఫిల్టర్ ద్వారా శుద్ధి చేసి గ్రామంలోని మినీ ట్యాంకుల ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో తాగునీరు ఫిల్టరైజేషన్ కాకపోవడం వలన నీరు రంగుమారినట్లు వైద్యశాఖ సిబ్బంది గుర్తించారు. ఇదే పరిస్థితి కొనసాగితే డయేరియా ప్రబలే ప్రమాదం పొంచి ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: కానూరు సనత్‌నగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు అవ్వటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు కృష్ణనగర్‌కు చెందిన అన్వర్‌బేగ్ అశోక్‌నగర్‌లో పని చేస్తాడు. అతను తన సైకిల్‌పై సనత్‌నగర్ పంటకాలువ రోడ్డు వద్దకు వచ్చి టిఫిన్ తీసుకున్నాడు. సైకిల్‌తో రోడ్డు దాటుతుండగా ఆటోనగర్ వైపు నుంచి వచ్చిన బైక్ అతనిని ఢీ కొంది. ఈ ఘటనలో అన్వర్‌బేగ్‌కు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం బాధితుడిని పటమటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. అన్వర్‌బేగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పంట పొలాల్లో మట్టి నమూనాలను సేకరించాలి



మాట్లాడుతున్న మనోహరరావు

గన్నవరం: స్థానిక సహాయ వ్యవసాయ సంచాలకుని కార్యాలయంలో గురువారం భూసార పరీక్షలపై సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి అధికారి మనోహరరావు మాట్లాడుతూ.. గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులు తప్పనిసారిగా పంట పొలాల్లో మట్టి నమూనాలను సేకరించాలన్నారు. సదరు మట్టి నమూనాలను గుడివాడలోని పరీక్ష కేంద్రానికి పంపించాలని సూచించారు. భూసార పరీక్షలు ఆధారంగా పంట సాగు, ఎరువుల వినియోగంపై రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. ఏడీ ఎం.సునీల్ మాట్లాడుతూ...పొలాల్లో పంట వ్యర్థాలను తగులబెట్టడం వల్ల నేలలోని పోషకాలు నశించి భూసారానికి, పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. పీఎండీఎస్ ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ నవధాన్యాల సాగుపై రైతులకు మరింత అవగాహన కల్పించాలని చెప్పారు. ఏవోలు రజని, లంకా శ్రీనివాసరావు, జె.భవాని తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



గన్నవరం డిపో ఎదుట నిరసన తెలుపుతున్న సంఘం నేతలు

గన్నవరం: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీపీటీడీ ఎస్ఎంయూఏ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట గురువారం నిరసన తెలియజేశారు. ఉద్యోగులు ప్లకార్డులు చేతపట్టుకుని న్యాయమైన తమ డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని నినాదాలు చేశారు. అనంతరం జరిగిన గేట్ మీటింగ్‌లో ఈ సంఘ జిల్లా అధ్యక్షులు నాగిరెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగ భద్రతకు సంబంధించిన సర్క్యులర్ 1/2019ను వెంటనే అమలుచేయాలని, అక్రమ సస్పెన్షన్లు, రిమూవల్స్ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గత నాలుగేళ్లుగా ఆగిపోయిన ప్రమోషన్లను వెంటనే ఇవ్వాలని, ప్రభుత్వ జీఓ ప్రకారం మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని కోరారు. అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలని, ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని తీసుకురావాలని, ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. జగదల్‌పూర్ డ్యూటీకి మూడు మస్టర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘం డిపో కార్యదర్శి శ్రీనివాసరావు, గ్యారేజ్ కార్యదర్శి ఆంజనేయులు, సంయుక్త కార్యదర్శి రాజు, కోశాధికారి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరులో నిరసన..

ఉయ్యూరు: ఎస్ఎంయూఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమస్యల పరిష్కారం కోరుతూ ఉయ్యూరు బస్టాండు ఆవరణలో గురువారం నిరసన ప్రదర్శన చేశారు. ప్లకార్డులు చేతపట్టి దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలంటూ ఆర్టీసీ ఉద్యోగులు ఆందోళన చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ డిపో కార్యదర్శి పీఎం కృష్ణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల శ్రీనివాసరావు, ప్రతినిధులు డీకే రావు, పిచ్చియ్య, అరుణోదయ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వేతన బకాయిలు చెల్లింపు కోరుతూ ధర్నా



ధర్నాలో సంఘం నేతలు, ఉపాధి కూలీలు

గన్నవరం: ఉపాధి హామీ కూలీలకు చెల్లించాల్సిన వేతన బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పవన్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రమైన ఉంగుటూరులోని ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి కూలీలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ కూలీలకు నెలలు తరబడి వేతనాలు చెల్లించకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కొత్తగా పని కోరిన వారికి జాబ్‌కార్డులు మంజూరు చేయడం లేదన్నారు. దీని వెనుక ఈ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర దాగి ఉందని చెప్పారు. ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకునేందుకు అందరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఉపాధి కూలీల సమస్యలపై ఏపీఓ వినీలాకు వినతిపత్రం అందజేశారు. అయితే జాబ్‌కార్డులు, ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపుపై ఏపీఓకు సంఘ నేతలకు వాగ్వివాదం చోటు చేసుకుంది. సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు పీహెచ్‌సీలో సీహెచ్‌ఓల నిరసన



పెనమలూరు పీహెచ్‌సీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీహెచ్‌ఓలు

పెనమలూరు: పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సీహెచ్‌ఓలు(ఎంఎల్‌హెచ్‌పీ) గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీహెచ్‌ఓలు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్ఎం) కింద రెండేళ్లుగా తాము వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. అయితే తమ వేతనాల విషయంలో చాలా సమస్యలు ఎదుర్కొంటున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఆరేళ్లు పూర్తి చేసిన వారికి రెగ్యులర్ చేయడంతో పాటు సకాలంలో జీతాల విడుదల, ఈపీఎఫ్ఓ పునరుద్ధరణ, గిరిజన ప్రాంతాల్లో పని చేస్తున్న సీహెచ్‌ఓలకు ప్రత్యేక రాయితీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించక పోతే ప్రత్యక్ష ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

7వ రాష్ట్ర మహాసభలు విజయవంతానికి పిలుపు

రామవరప్పాడు: కొండపల్లిలో ఈనెల 20, 21 తేదీల్లో నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం 7వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని రజక సంఘ నాయకుడు, ఎనికేపాడు వార్డు సభ్యులు రాచమళ్ల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల మంది రజక జనాభా ఉన్నారన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు గడిచినప్పటికి రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు గాని, ప్రభుత్వ విధానాలు గాని రజకుల అభివృద్ధికి ఏ మాత్రం దోహదపడలేదన్నారు. రజకులకు సామాజిక రక్షణ ఏర్పాటు, నెలకు 200 యూనిట్ల ఉచిత కరెంటు అమలు, 50 ఏళ్లు నిండిన ప్రతి రజకునికి వృద్ధాప్య పింఛన్ మంజూరు, ఆదరణ-2 పథకం ద్వారా వృత్తి పరికరాలు అందిస్తామని కూటమి ప్రభుత్వం 2024 ఎన్నికల్లో ఎన్నికల హామీగా ప్రకటించిన అమలుకు మాత్రం నోచుకోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన హామీల అమలుకు రజకులందరూ ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో కొండపల్లిలో ఈనెల 20, 21 తేదీలలో రాష్ట్ర రజక వృత్తిదారుల సంఘం 7వ రాష్ట్ర మహా సభలు నిర్వహించనున్నామని చెప్పారు. ఈనెల 20న కొండపల్లి వీటీపీఎస్ బీ1 కాలనీ గ్రౌండ్‌లో జరిగే భారీ బహిరంగ సభకు రజకులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పెనమలూరు పీఎస్ పరిధిలో ఇద్దరి అదృశ్యం

పెనమలూరు: పెనమలూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరి అదృశ్యంపై పోలీసులు గురువారం కేసులు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప వసంతనగర్ కాలువకట్టకు చెందిన బి.రాంబాబు భార్య, ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటున్నాడు. రాంబాబు కుమార్తె(16) విజయవాడలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ నెల 16న కాలేజీకి వెళ్లినా ఆమె తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు కాలేజీలో విచారించగా ఆమె కాలేజీకి రాలేదని తెలిపారు. దీంతో రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

కానూరులో వృద్ధుడు..

పెనమలూరు: కానూరులో వృద్ధుడు అదృశ్యమైన ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు గుమ్మడి తోటకు చెందిన వీర్ల వెంకటస్వామి(80) ఈ నెల 15వ తేదీ ఉదయం వాకింగ్‌కని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అయితే అతను తిరిగి ఇంటికి రాలేదు. దీంతో అతని కుమారుడు వీర్ల శేషమోహన్‌రావు, బంధువులు అనేక ప్రాంతాల్లో ఆరా తీసినా వెంకటస్వామి జాడ తెలియక పోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.